క్లుప్తంగా

అలరించిన గజల్ శ్రీనివాస్ సంగీత విభావరి



గుంటూరు రూరల్: దసరా నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా గోరంట్లలోని శ్రీవేంకటేశ్వరాలయంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం కార్యక్రమంలో భాగంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. బతుకమ్మ సంబరాలు చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సినీ గాయకుడు గజల్ శ్రీనివాస్ సంగీత విభావరి భక్తులను అలరించింది. అలనాటి గీతాలతో అమ్మవారి భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్, చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఆళ్ళ శివారెడ్డి, గజవల్లి శివన్నారాయణ, దేవరశెట్టి సురేష్, ఓబులుశెట్టి వెంకటనారాయణ, కూనిశెట్టి శ్రీనివాసరావు, పూసల శివయ్య తదితరులు గజల్ శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా సన్మానించారు.

పారిశుద్ధ్య కార్మికులపై గుమస్తా వీరంగం

పెదకాకాని: పంచాయతీ గుమస్తా(జూనియర్ అసిస్టెంట్) అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని పారిశుద్ధ్య కార్మికులు ఆరోపిస్తున్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన ఆళ్ళ రాఘవరెడ్డి పంచాయతీ ఉపయోగించే పారిశుద్ధ్య పనుల్లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పంచాయతీలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ప్రభు ఉద్దేశపూర్వకంగా చేతిలో తాళాలు లాక్కుని పనుల నుంచి తాత్కాలికంగా తొలగించాడు. ట్రాక్టర్ డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకునే విషయంపై గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి, జూనియర్ అసిస్టెంట్‌తో చెప్పినా వినకుండా పంచాయతీలో పెత్తనం చేస్తున్నాడు. గ్రామ ప్రథమ పౌరురాలు మాట కూడా వినకుండా అవమాన పరుస్తున్నాడు. ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో అసభ్యంగా మాట్లాడుతూ, కక్ష్య పూర్వకంగా ఇబ్బంది పెడుతున్న పంచాయతీ గుమస్తాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విజ్ఞాన్‌లో ఘనంగా దాండియా ఉత్సవాలు



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో దసరా పండుగను పురస్కరించుకుని విద్యార్థులు దాండియా, బతుకమ్మ, గర్బా సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ నలుగురిలో కలవలేకపోతున్నామనుకునే విద్యార్థులకు నవరాత్రుల్లో చేసే దాండియా, గర్బా నృత్యాలు కొత్త ఉత్సాహాన్ని అందిస్తాయన్నారు. మీరు ఎంచుకున్న నృత్యం ఏ రూపంలో ఉన్నా... అందరితో కలిసి ఆడుతూ, పాడుతూ ఉంటే బృంద స్ఫూర్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులలో దసరా నవరాత్రి ఉత్సవాలు



గుంటూరు రూరల్: పలకలూరు రోడ్డులోనిన విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం దేవీ నవరాత్రి కార్యక్రమాలకు విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అభీష్ట దాయిని, శక్తి స్వరూపిణి దుర్గాదేవి అని తెలిపారు. కళాశాల విద్యార్థినులకు బతుకమ్మ, దసరా వేష ధారణ, దాండియా, సాంప్రదాయ వస్త్ర ధారణ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు.

వేజండ్లలో రోడ్లపై పొంగి ప్రవహించిన వర్షపు నీరు



వేజండ్ల(చేబ్రోలు): కొద్దిపాటి వర్షానికి గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. గ్రామంలో బుధవారం కురిసిన వర్షానికి ప్రధాన రహదారిపై మోకాలి లోతులో వర్షంనీరు పొంగి ప్రవహించింది. గ్రామంలో కురిసిన వర్షంనీరు సైడ్ డ్రైయిన్‌ల ద్వారా ప్రవహించాల్సి ఉన్నప్పటికీ ప్రధాన రహదారి గుండా ప్రవహించటంతో రాకపోకలు సాగించేవారు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెరువును తలపించే విధంగా సిమెంటు రోడ్లపై వర్షంనీరు చేరింది.

ఎర్రమట్టి దోచేస్తున్నారు...

టీడీపీ తమ్ముళ్ల మాఫియా

- రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు
- లారీ రూ.6–8 వేలకు విక్రయం
- రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు తరలింపు
- ప్రజాప్రతినిధి అండదండలతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో అక్రమ మైనింగ్
- పట్టించుకోని మైనింగ్, పోలీస్ అధికారులు



నాయుడుపేటలో అక్రమ మైనింగ్ ప్రాంతం ఇదే



ఓబులునాయుడుపాలెం పరిధిలో అక్రమ మైనింగ్ క్వారీ నీటితో నిండిన దృశ్యం

గుంటూరు రూరల్: తెలుగుతమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. ఆకాశమే హద్దుగా దందాలకు పాల్పడుతున్నారు. నిబంధనలకు తిలోదకాలిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలు తేడా లేకుండా ఎర్రమట్టి తవ్వకాలతో కోట్లు దండుకుంటున్నారు.

వివరాలు.. గుంటూరు రూరల్ మండలంలో ఓబులునాయుడుపాలెం, నాయుడుపేట, వెంగళాయపాలెం, చిన్నపలకలూరు, గోరంట్ల క్వారింగ్ చేస్తున్నారు. ప్రజా ప్రతినిధి అల్లుడు పేరుతో మట్టి తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం. ఏకంగా ప్రజాప్రతినిధి కార్యాలయం నుంచి ఒకరిద్దరు వచ్చి తవ్వకాలు జరిపే ప్రాంతంలో రాత్రి, పగలు తరలిస్తున్న వాహనాల లెక్కలు రాసుకుంటున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్న క్వారీల్లో మట్టిని తవ్వుకునేందుకు నిర్ణీత అడుగుల లోతు వరకూ అనుమతులు ఇస్తారు. కానీ అక్రమ మైనింగ్‌లకు పాల్పడే వారు 30–40 అడుగుల లోతు వరకూ తవ్వుతుండటంతో భూమి నుంచి నీరు ఊరి క్వారీలు చెరువులను తలపిస్తున్నాయి. నీరు నిండి చెరువుల్లా కనిపిస్తుండటంతో క్వారీల్లో దిగి అమాయక చిన్నారులు, పెద్దలు ప్రాణాలను కోల్పోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. అటువంటి క్వారీల్లో నీటిని ఆయిల్ ఇంజన్లతో తోడి మళ్లీ తవ్వకాలు చేస్తున్నారు.

ఎక్కడెక్కడ తవ్వకాలంటే..

ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో అక్రమ మైనింగ్ స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో జోరుగా సాగుతోంది. రూరల్ మండల పరిధిలోని ఓబుల్‌నాయుడుపాలెం, వెంగళాయపాలెం, పొత్తూరు, నాయుడుపేట పరిధిలో జరుగుతున్నాయి.

ధర ఎంతంటే..

లారీ ఒకొక్కటి రూ.6–8 వేలకు విక్రయాలు చేపడుతున్నారు. ఈ అక్రమ తవ్వకాల్లో ప్రజా ప్రతినిధి కార్యాలయానికి లారీకి రూ.300 చెల్లిస్తున్నట్లు సమాచారం. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిని ఎవరైనా ప్రశ్నిస్తే అధికారం మాది, అధికారంలో ఉన్న వారిని కూడా అధికారులు ప్రశ్నిస్తారా అన్న సమాధానాలు వస్తున్నాయని అధికారులు వాపోతున్నారు. తెలుగు తమ్ముళ్ల బెదిరింపులకు అధికారులు భయపడి అటువైపు చూసేందుకు కూడా వెళ్లటం లేదని ప్రజలు చెబుతున్నారు.

ప్రజాప్రతినిధి రెండు నాల్కల ధోరణి

ప్రస్తుతం అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న ప్రజా ప్రతినిధి ఎన్నికల సమయంలో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని సరాసరి మైనింగ్ క్వారీల వద్దకు వెళ్లి ప్రెస్‌మీట్‌లు పెట్టి మీడియా ద్వారా పెద్దఎత్తున ప్రచారం చేశారు. అధికారంలోకి రాగానే ఆయనే స్వయంగా తమ పార్టీ నాయకులతో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతుండటంతో రెండు నాలుకల ధోరణిపై ఆయా గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆయిల్ ట్యాంకర్ సిద్ధం..

వాహనాలు ఆయిల్ కోసం పెట్రోలు బంకుల వరకు వెళ్తే సమయం వృథా అవుతుందని, ట్యాంకర్లను క్వారీల వద్దకే తెప్పించుకుని ఆయిల్ నింపుకుంటున్నారు. ఆ సమయాన్ని కూడా సద్వినియోగం చేసుకునేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎక్కువ ట్రిప్పులు అక్రమ మైనింగ్‌కు వీలయ్యేలా చూసుకుంటున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అక్రమంగా మట్టితవ్వకాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– సుధీర్ వెంకటసాయి, డీడీ, మైనింగ్ డిపార్ట్‌మెంట్

ములుకుదురులో పొలం పిలుస్తోంది



పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఓ వెంకట్రామయ్య

పొన్నూరు: మండలంలోని ములుకుదురు, మాచవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పైరుకు పొటాష్ ప్రయోజనాన్ని మండల వ్యవసాయ అధికారి డేగల వెంకట్రామయ్య వివరించారు. వరి చిరుపొట్ట దశలో ప్రతి ఒక్కరూ ఎకరాకు 20 నుండి 25 కిలోలు పొటాష్, 25 నుండి 30 కిలోల యూరియా చల్లుకోవాలని తెలియజేశారు. వరి సాగులో నీటి యొక్క యాజమాన్యం చాలా కీలక భూమిక పోషిస్తుందని, నాటు వేసిన నాటి నుండి చిరుపొట్ట దశ వరకు వరిలో నీరు ఆరుతడి అందించాలని పేర్కొన్నారు. దీనివల్ల పిలకల సంఖ్య అధికంగా పెరుగుతుందని, తద్వారా దిగుబడి పెరుగుతుందన్నారు. పొటాస్ వాడకం ద్వారా చీడపీడల ఉధృతి, తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని చెప్పారు. తకార్యక్రమంలో రైతు విభాగ ప్రధాన కార్యదర్శి బి.రామారావు రైతు సేవ కేంద్రం డి.వి. సుబ్బారావు, సింహాద్రి సురేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

పంటల మార్పిడితో ప్రయోజనాలు

ప్రత్తిపాడు: పంటల మార్పిడితో అధిక ప్రయోజనాలుంటాయని ఏవో అరుణకుమారి అన్నారు. ప్రత్తిపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెదనందిపాడు మండలంలోని కట్రపాడు, నాగులపాడు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో మిర్చి, పత్తి పంటలను ఏఓ బి.సుధారాణి పరిశీలించారు.

కంట్రపాడులో..

కంట్రపాడు(కాకుమాను): రబీ సీజన్‌లో పత్తి సాగు చేస్తున్న రైతులు పంటపై తెల్ల దోల్ల, పచ్చదోమ ఆశించ కుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఏఓ బి.సుధారాణి సూచించారు. పెదనందిపాడు మండలంలోని కంట్రపాడు,నాగులపాడు గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

కాకుమానులో..


మండలంలోని కేబీపాలెం, చినలింగాయపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి పాల్గొన్నారు. వరిలో అకుచుట్టు పురుగు నివారణకు రైతులు క్లోరిపైరిఫాస్ మందును పంటపై పిచికారి చేయాలని ఆమె తెలిపారు.కార్యక్రమంలో ఏవో కె.కిరణ్మయి,రైతులు,సిబ్బంది పాల్గొన్నారు.




కొండపాటూరులో సరస్వతీ దేవిగా అమ్మవారు




మంచాలలో సరస్వతీదేవీ అలంకారంలో..



శలపాడులో సరస్వతీదేవి అలంకారంలో..



వెనిగండ్ల శ్రీవేణుగోపాలస్వామి ఆలయం వద్ద అమ్మవారు సరస్వతీదేవిగా..



పంచాయతీ కార్యాలయ సమీపంలో కనకదుర్గ అమ్మవారు సరస్వతీదేవిగా..



ప్రత్తిపాడు వేణుగోపాల స్వామి ఆలయంలో సరస్వతీదేవిగా..

• సరస్వతీ నమస్తుభ్యం



ప్రత్తిపాడు వేణుగోపాలస్వామి దేవాలయంలో సరస్వతీ పూజలు

దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. బుధవారం కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి సరస్వతిదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. చండీ హోమాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



జొన్నలగడ్డలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



ప్రత్తిపాడు అద్దంకమ్మ తల్లి సరస్వతీదేవి అలంకరణ



దండేశ్వరాలయంలో సరస్వతీదేవిగా పార్వతిదేవి..



పెదకాకాని భ్రమరాంబ అమ్మవారు సరస్వతీదేవిగా..

• అలంకారప్రాయంగా..



పురపాలక సంఘ పరిధిలోని 31 వార్డులలో మరుగుదొడ్ల ట్యాంకులు శుభ్రం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వాహనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. సుమారు రూ.15 లక్షలతో ఈ వాహనాన్ని కొనుగోలు చేసినట్లు సమాచారం. గత కొన్ని నెలలుగా వృథాగా కార్యాలయం వెనుక ఆవరణలో నిలిచిపోయి, టైర్లు భూమిలోకి వెళుతున్నాయి. ఇదే పరిస్థితి మరి కొన్ని రోజులు కొనసాగితే వాహనం పాడయ్యే ప్రమాదముంది. - పొన్నూరు

మద్యం దుకాణాలకు పోటెత్తుతున్న అర్జీలు

- ఇప్పటి వరకు 13 షాపులకు 254 దరఖాస్తులు
- రేపటి వరకు దరఖాస్తుకు సమయం పొడిగింపు



ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషనులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ రవీంద్రబాబు

ప్రత్తిపాడు: మద్యం దుకాణాలకు అర్జీలు పోటెత్తుతున్నాయి. ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషను పరిధిలోని పద మూడు మద్యం దుకాణాలకు ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తుంది. తొలి రెండు మూడు రోజులు దరఖాస్తుల దాఖలు మందకొడిగా సాగినప్పటికీ, రెండు రోజులుగా దరఖాస్తులు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. బుధవారం సాయంత్రం వరకు 13 దుకాణాలకు గాను మొత్తం 254 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషను పరిధిలోని ప్రత్తిపాడు మండలంలో 84వ నంబరు షాపునకు 29, 85వ నంబరు దుకాణానికి 24, 86వ నంబరుకు 29, 87వ నంబరుకు 25, వట్టిచెరుకూరు మండలంలోని 88వ నంబరు షాపునకు 17, 89వ నంబరుకు 16, 90వ నంబరుకు 17, చేబ్రోలు మండలంలోని 91వ నంబరు షాపునకు 14, 92వ నంబరుకు 15, 93వ నంబరుకు 17, 94వ నంబరుకు 17, 95వ నంబరుకు 16, 96వ నంబరుకు 18 చొప్పున మొత్తం 254 దరఖాస్తులు అందినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు. దరఖాస్తు దాఖలుకు రేపు సాయంత్రం వరకు సమయం ఉందని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తును ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇప్పటి వరకు దరఖాస్తుల మీద ప్రభుత్వానికి రూ.5 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా దరఖాస్తులు, ఆదాయం పెరిగింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అంకిరెడ్డిపాలేనికి చెందిన గుర్రాల మరియదాసు(59) ద్విచక్ర వాహనంపై వెళుతూ నల్లపాడు నుంచి అంకిరెడ్డిపాలెం వెళ్లే దారిలో సాయిబాబా గుడి దాటిన తరువాత రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీని ఢీకొని రోడ్డుమీద పడడంతో వెనుకగా వస్తున్న కారు మరియదాసుపై నుంచి వెళ్లింది. దీంతో మరియదాసు ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఘటనపై నల్లపాడు పోలీసులు రుద్ర ట్రస్టు సహాయంతో జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వంశీధర్ తెలిపారు.

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ



గుంటూరు రూరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని నల్లపాడులోని శ్రీఅగస్త్యేశ్వర ఆలయంలో ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామంలోని విద్యార్థులకు భక్తులు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. 150 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన



నెహ్రూనగర్: ఒడిశాలోని బాసుగై మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒడిశా అర్బన్ అకాడమీలోని వికేంద్రీకృత ఘన వ్యర్థాల నిర్వహణ సెంటర్, మల వ్యర్థాల శుద్ధి కేంద్రాల పనితీరును, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను అక్కడి అధికారులు నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు వివరించారు. స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం ఒడిశా రాష్ట్రంలో కమిషనర్ పర్యటించి అక్కడ అమలు జరుగుతున్న పలు విషయాలను తెలుసుకున్నారు.

వలంటీర్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చైతన్య డిమాండ్



లక్ష్మీపురం: వలంటర్ వ్యవస్థపై ప్రభుత్వం క్యాబినేట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని వలంటరీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం రాకముందు వలంటీర్స్‌కు రూ.10 వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానం నిలుపుకోవాలని కోరారు. దసరాకు మంచి వార్త చెప్పాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ జిల్లా కన్వీనర్ ఓ రాజేష్, వెంకటరెడ్డి, అబ్దుల్ వజీత్, నాగరాజ్, రమేష్, నజీర్ బాబు, అరుణ్, గాయత్రి పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత

మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్

నెహ్రూ నగర్: ప్రధాన మంత్రి స్వానిధి ద్వారా చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత అందిస్తుందని, గుంటూరు నగరంలోని వీధి వ్యాపారులతో స్వానిధి వెబ్‌సైట్‌లో నమోదు చేయించాలని ఏపీ మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ ఆదేశించారు. స్వానిధి సే సమద్ధి వారోత్సవాల్లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వీధి వ్యాపారులు, ఆర్‌పీ, సీఎంఎంలతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వానిధి అమలు చేస్తుందని, స్వానిధిలో వీధి వ్యాపారులను నమోదు చేయడం ద్వారా వారికి ఎనిమిది రకాల సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. ఆర్‌పీలు తమ పరిధిలోని వీధి వ్యాపారులకు పథకంపై అవగాహన కల్పించి ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో నమోదు చేయించాలని కోరారు. వీధి వ్యాపారులు తగిన డాక్యుమెంట్స్‌తో స్వానిధిలో నమోదు కావడం ద్వారా వారికి తొలుత రూ.10 వేలు, సక్రమంగా చెల్లిస్తే తిరిగి రూ.20 వేలు, ఆ తర్వాత రూ.50 వేలు అతి తక్కువ వడ్డీ రేటుకి రుణాలను బ్యాంక్‌లు అందిస్తాయని తెలిపారు. డిజిటల్ పేమెంట్స్ ప్రోత్సహించడం ద్వారా ప్రతి నెల రూ.100 వరకు క్యాష్ బ్యాక్ వస్తుందని వివరించారు. పేదలుగా ఉండే వీధి వ్యాపారులను, వారి కుటుంబ సభ్యులను స్వానిధి వెబ్‌సైట్‌లో నమోదు చేసి వారికి ఆర్థిక భరోసాని కల్పించడానికి మెప్మా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జీఎంసీ పరిధిలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపితే తగిన తోడ్పాటుని అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మెప్మా పీడీ(ఎఫ్ఏసీ) టీవీ విజయలక్ష్మి, జీఎంసీ డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, డెప్యూటీ మేయర్ షేక్ సజిల, ఉపా సెల్ పీఓ బాలాజీ బాషా, సీడీపీఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

నర్సింగ్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఈమేరకు బుధవారం గుంటూరు కో ఆపరేటివ్ సబ్ డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.తులసి బ్రహ్మమ్మ జీజీహెచ్‌కు విచ్చేసి ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు, ఓట్లు వేయాలనుకునే వారు ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేవో సరిచూసుకోవాలని ఎన్నికల అధికారి కోరారు. జీజీహెచ్‌లో ఈనెల 23న జిల్లా నర్సుల సంఘం ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసేవారు ఈనెల 14న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని, దాని ప్రకారం పోటీ దారులు నామినేషన్లు దాఖలు చేయాలని ఎన్నికల అధికారి తెలిపారు. 16న నామినేషన్లు స్వీకరణ, 17న నామినేషన్లు పరిశీలన, 18న నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల అధికారితోపాటు, నర్సింగ్ యూనియన్ నేతలు వెలంపల్లి పద్మజ, సునీత, ఇతరులు ఓటర్ల జాబితాను ప్రదర్శించి నర్సింగ్ సిబ్బంది అంతా ఓటర్ల జాబితాను సరిచూసుకోవాలని కోరారు. గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట, గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో నర్సింగ్ యూనియన్ ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.